ఏడుకానాల వంతెన

ముందురోజు రాత్రి పోలీసులకు పట్టుబడిన కుర్రాడు బక్కపల్చగా, లేతగా, నిర్లక్ష్యంగా ఉన్నాడు. ఏడుకానాల వంతెనపై అతని చేతుల్ని తాడుతో వెనక్కి విరిచికట్టి నిలబెట్టారు. అతని నూనూగుమీసాలు, హవాయిచెప్పులు, లూజుపేంటు, టెర్రీకాట్ షర్టుచూస్తే అతడొక గ్రామీణహైస్కూల్ లేదా హైయ్యర్ సెకెండరీ స్కూల్ విద్యార్థి అనితెలుస్తోంది. మహా అయితే పద్దెనిమిదేళ్లు.

పేరుకి ఏడుకానాల వంతెనేగాని, నాలుగే మిగిలాయి. ఎప్పుడో బ్రిటీషువాళ్లు కట్టించినది. నల్లరాతికట్టుడు . స్తంభాలమీద పిచ్చిమొక్కలూ, గడ్డీ, గాదరా. తుప్పెక్కిన పట్టాలు – స్లీపర్లతోసహా గాలిలో వేలాడుతూ. పక్కనేకట్టిన కొత్తవంతెన మీదనే రైళ్లు వెళతాయి. హౌరా మెయిల్ రావడానికి రెండు గంటలుంది. మెడ్రాస్ మెయిల్ ఎప్పుడో వెళ్లిపోయింది.

"పిలవగానే రాకుండా ఎక్కడరా తిరుగుతున్నావు? గాడిదా!...ఇప్పుడింకా ఏవయినా ట్రైన్లు వస్తాయా ?...సరిగ్గాచెప్పరా, అడ్డగాడిదా!" అని సర్కిల్ ఇన్స్పెక్టర్, రైల్వేగేట్ మేన్ని గద్దించాడు – చిరాగ్గా, కోపంగా. ఇన్స్పెక్టర్ చాలా టెన్షన్ లో ఉన్నాడని తెలుస్తూనే ఉంది.

"గంటలోపల రెండుగూడ్సు బళ్లు రావాలి సార్. ఒకటి అప్పు, ఒకటి డౌను. ఏడుతరవాత మళ్లీఈస్టుకోస్టు. అదెప్పుడూ లేటే.... దాంతరవాత పూరీపాసింజరు... అదేరోజెప్పుడొస్తుందో భగవంతుడికే తెలియాలి..... ," చెప్పుకుపోతున్నాడు ఎర్ర, ఆకుపచ్చ జెండాల ను చుట్టి చంకలోపెట్టుకున్న సోడాబుడ్డీ కళ్లద్దాల రైల్వే ఉద్యోగి.

"సరే, సరే,....నువ్వెళ్లికేబిన్లో కూర్చో. ఒకవేళ రైలేదయినా వస్తేగనక ఆపుచెయ్యి; నేనుచెప్పేంత వరకూ సిగ్నల్ ఇవ్వకు. ఎక్కువసేపు పట్టదులే,"

"చిత్తం" అనివెళ్లిపోయాడుగేట్ మేన్. వెర్రిబాగులవాడిలా కనిపిస్తాడుగాని అతనికంతా అర్థంఅవుతూనేఉంది. 'జనశక్తి' చదువుతాడు. నాగిరెడ్డిగ్రూపుకి సానుభూతిపరుడు. ఇన్స్పెక్టర్ తన బృందంతో లెవల్ క్రాసింగ్ మీదుగా, పట్టాల వెంబడి ఇటుగా కేబిన్ వైపు రావడం చూసినప్పుడే ఇక్కడేదో తేడాగా ఉందని అతనికి అనిపించింది. అర్జెంటుగా ఏదోఒకటి చెయ్యమ ని పక్కూర్లో ఉన్న కామ్రేడుకి చీటీరాసి, కొడుకు చేతికిచ్చి, సైకిలుమీద పంపించి హడావుడిగా ఇలా వచ్చాడు.

క్లోజ్రేంజిలో త్రీ–నాట్–త్రీ రైఫిల్ తో కాల్చి చంపడం కొంచెం అతిగా ఉంటుందని సీఐకి అనిపించింది. పోస్టుమార్టంలో నానాకంగాళీ అవుతుంది. తన సర్వీస్ రివాల్వర్ వాడడమే పకడ్బందీగా ఉంటుందని అతని భావన. అతనేంచేసినా బాగా ఆలోచించి చేస్తాడని డిపార్టుమెంటులో పేరు గడించాడు. అయినదానికీ, కానిదానికీ అతిగా ఆలోచించి పీకలమీదకి తెచ్చుకుంటాడని కిట్టనివాళ్లంటారు. ఈసారిమాత్రం నిజంగానే మంచిపథకం వేసుకున్నాడు; బాగా నమ్మకస్తులైన ఇద్దరేఇద్దరు కానిస్టేబుల్స్ ని వెంటతీసుకొని బయిల్దేరాడు. నమ్మశక్యంగాఉండే కథనం ఒకటి తయారుచేసి పెట్టుకున్నాడు: 'రైల్లో తీసుకొస్తూంటే నేరస్తుడు బాత్రూంకి వెళ్తాననిచెప్పి వెంటవచ్చిన కానిస్టేబులు చేతుల్లోంచి రైఫిల్ లాక్కున్నాడు. ఆ గలాటా విని తను లేచివెళ్లేసరికి రైఫిల్ని తనమీదకి తిప్పడంతో సర్వీస్ రివాల్వర్ తో కాల్చడంతప్ప ఆత్మరక్షణకు మరోమార్గం లేకపోయింది. తలకుగాయం అయి రక్తంకారుతున్నా, వంతెనరాగానే నేరస్తుడు రైల్లోంచి దూకేశాడు. పరారీలోఉన్న నేరస్తుడి కోసం దిగువ గ్రామాల్లో గాలింపు చర్యలు చేబట్టాము ' — ఈవిధంగా రిపోర్ట్ రాయించమని స్టేషన్లో హేడ్డుగారికి పురమాయించి వచ్చాడు.

'సీఐగానే రిటైరైపోతానా లేక అనుకోకుండా తగిలిన ఈ బంగారు అవకాశాన్ని వాడుకొని మరో ప్రమోషన్ దక్కించుకుంటానా?— లేదంటే ఎటూకాకుండా తన బాస్, శ్రీకాకుళం డీఎస్పీ మొత్తం క్రెడిట్ కొట్టేస్తాడా?' ఏ సంగతీ తేల్చుకోలేకపోతున్నాడు. డీఎస్పీదొరగారి చొరబాటుకి అవకాశంలేకుండా తొందరగా ఈ కార్యక్రమం ముగించాలి; ఏదిఏమైనా సరే, ఈ కేసులోమాత్రం తనపేరే ముందుండాలని ఒక నిర్ణయానికి వచ్చేశాడు. నిన్నగాక మొన్న డీఐజీ అంతటివాడు స్టేషన్ కి ఫోన్చేసిమరీ ఆర్డర్

పాస్ చేసేశాడు — ఇకమీదట దొరికినవాళ్లను దొరికినచోటే వీళ్లని ఫినిష్ చేసెయ్యాలనీ, తేడావస్తే తనే స్వయంగా చూసుకుంటాననీ. ఈ కుర్రవాడు పట్టుబడిన సంగతి డీఎస్పీకి ఫోన్ చేస్తే, చాలా బిజీగా ఉన్నాను, డీఐజీదొర చెప్పినట్టే కానిమ్మన్నాడు. 'ఏమిటో, ఈయనగారికన్ని రాచకార్యాలు? ఏది ఎలాగున్నా తన సర్వీసు చివరిదశలో ఇదో గొప్ప అవకాశం. పెద్ద రిస్కు కూడా'.

పట్టుబడ్డ యువకుడు కొంతకాలంగా పోలీసులకు దొరక్కుండా తప్పించుకుంటున్నాడు; అతనొక ముఖ్యుడైన కొరియర్ అని రికార్డులో ఫోటోతోసహా ఉంది. అయినా ఎంతకొట్టినా ఏమీ చెప్పాడుకాదు. ఇప్పుడైనా కాళ్లావేళ్లా పడతాడేమో, ఏడుపు లంకించుకుంటాడేమో అనుకున్న సీఐకి ఒకింత ఆశ్చర్యంకలిగింది. చిన్నచిన్న జేబుదొంగలుకూడా దొరికిపోయాక కాళ్లుపట్టుకోవడం, లంచమిచ్చుకోవడం — ఇవన్నీ అతనికి బాగా అనుభవం. ఈ కుర్రాడిలో భయం అన్నది కనిపించకపోయేసరికి సీఐకి లోలోపల మీమాంస పట్టుకుంది. రేప్పొద్దున్న ఏ ఎంక్వైరీయో మొదలైతే? ఒక్క రిమార్కు కూడా లేకుండా కాపాడుకుంటూ వచ్చిన సర్వీసంతా మంట గలిసిపోతుంది.

★★★

ఆ కుర్రవాడి పేరు కోట పెదబాబు; ఊరు బొడ్డపాడు. ఆ అరుణాకాశపు సాయంత్రాన దూరంగా తూర్పుకనుమల నడుమ అస్తమిస్తూన్న సూర్యుడిని తదేకంగా చూస్తున్నాడు. రాత్రి పోలీసులు కొట్టిన దెబ్బలకి వీపుమీద తేలిన తట్లు చెమట కి తడిసిన చొక్కాకి తగిలి చుర్రుమని మంటపెడుతున్నాయి. అతనామంటని పట్టించుకోవడంలేదు. 'పీకే తప్పించుకున్నాడా లేదా? కబురుఅందిందా లేదా?' ఎంతసేపూ ఇదే అతని ఆలోచన. పోలీసులన్నాక అరెస్టుచేస్తారని తెలుసు; నాలుగు తగల్నిస్తారనీ, కేసుపెట్టి జైలుకి పంపిస్తారనికూడా తెలుసు. మరీ హడావుడంతా దేనికి? ఊరికే భయపెట్టడానికి అయ్యుంటుంది; లేక నిజంగానేచంపుతారా?...ఒక్క క్షణం అతని వెన్నువెంట భయసర్పం జరజరా పాకింది. మరు నిముషంలోనే దుఃఖంతో కళ్లల్లో నీళ్లు తిరిగాయి. తన జీవితం ఇలా ఈ సాయిత్రం పూట, ఈ మారుమూల, పాత వంతెనమీద ముగిసిపోతుందంటే నమ్మలేక పోతున్నాడు. ఎదురుగా – పచ్చటివెలుగులో, సిల్వర్ పెయింటు పులుముకొని ఠీవిగా మెరుస్తున్న కొత్త ఉక్కువంతెన. సరిగ్గా అప్పుడే ఒక లేతపసుపురంగు సీతాకోకచిలుక తారట్లాడుతూ వచ్చి అతని దృష్టిని మరల్చింది. అతని మొహం ముందు రెండు చక్కర్లుకొట్టి ఎటో వెళ్లిపోయింది.

పెదబాబు వంతెన పైనుండి కిందికి చూశాడు, సుడులు తిరుగుతూ వడిగా ప్రవహిస్తున్న వాగు సూర్యాస్తమయపు బంగారు కాంతుల చిరుకెరటాలతో తనకు వీడ్కోలు చెబుతూన్నట్టుగా తోచింది; తనను ఆహ్వానిస్తున్నట్టుగా కూడా అనిపించింది. అతను కాసేపు కళ్లు మూసుకున్నాడు. అమ్మనీ, నాన్ననీ, ప్రాణమిత్రులు దుష్యంతనీ, పొందల బాలకృష్ణనీ కళ్లముందు మెదిలారు — అలాగే పాటలుపాడే తన క్లాస్మేటు — చిన్నప్పటినుండీ చేరువగా ఉంటూన్న స్నేహితురాలు కూడా. అతననుకున్నాడు, నా చేతుల్నిగనక విడిపించుకోగలిగితే ఇప్పుడే దూకేస్తాను; ఈదుకుంటూ వెళ్లిపోతాను — ఉధృతంగా ప్రవహిస్తూన్న వాగు వెంబడే — మేనమామల ఊరివైపుగా; అదే, అమ్మ పుట్టిన ఊరు....అతని ఆలోచనలు ముందుకి పరుగెత్తుతున్నాయి....

ధైర్యంచేసి దూకేశాడు. శక్తికొద్దీ ఈదుతున్నాడు; వాగు తన ప్రవాహవేగంతో ఏడుకానాలవంతెన నుండి తనను దూరంగా లాక్కుపోతోంది. అబ్బో,పారిపోతే పోలీసులు ఊరుకుంటారా? తమ రైఫిల్స్ ని గురిపెడతారు. తూటాలవర్షం . అదృష్టవశాత్తూ ఆతూటాలేవీ తనను తాకవు. హమ్మయ్య, బతికిపోయాను. చీకటిపడుతోంది. తూటాల మృత్యుసంరంభం ఆగిపోయింది. ఇప్పుడిక అంతటా నిశ్శబ్దం – వాగు తన చిరుకెరటాలతో ఒడ్డునచేస్తున్న మృదుసవ్వడి తప్ప; అదొక జోలపాట. బాగా అలసిపోయి ఒడ్డుకి చేరుకొని, అతికష్టంమీద లేచి నిలబడ్డాడు; అడుగులు బరువుగా పడుతున్నాయి. హవాయి చెప్పులు ఎప్పుడో జారిపోయాయి. తడిసిన చొక్కా, బురద పేంటూ ఒంటికి అంటుకుపోయాయి; చలీ, చిన్నగా వణుకు. చీకటి పడింది. గుడ్డి వెన్నెల. కప్పల బెకబెక. నక్షత్రాల మిలమిల. అమ్మమ్మ చిన్నప్పుడు చూపించింది – అదిగో, అదే సప్తఋషిమండలం. చెరువుగట్టున నడుస్తున్నాడు. మూకుమ్మడిగా నక్కలు

అరిచాయి. నారకోసం జనపమొక్కల కట్టల్నిచెరువులో నానబెట్టినట్టున్నారు — అబ్బ! ఒకటే వాసన. మర్రిచెట్టు కింద చిమ్మచీకట్లో కొత్తగా సున్నంవేసిన అమ్మవారిగుడి, తెల్లగా — చిన్ననాటి భయాల్ని గుర్తుచేస్తూ. దూరంగా కరెంటుదీపాలు; అదేఊరు చెప్మా? ఎవరైనా కనిపిస్తే అడగాలి. ఇప్పుడు గబగబా నడవ గలుగుతున్నాడు. ఈ లెక్కన తెల్లారేలోగా మావయ్యల ఊరుచేరుకుంటాడు. కోపిష్టి పెద్దమావయ్య తనని ఇంట్లోకి రానిస్తాడా? ఈ ఒక్క రాత్రికైనా? మావయ్య కూతురు తన అవతారంచూసి నవ్వుతుందా?.....రేపొక్క పగలు గనక ఏదోలా దాక్కుంటే తప్పించుకోగలడు. ఇంతకీ పీకేని తప్పించారోలేదో? సోంపేట, ఇచ్ఛాపురం స్టేషన్ల పోలీసు బృందాలు మాటువేసి ఉన్నాయనే కబురు అతనికి చేరిందో లేదో?....మళ్లీ అవే ప్రశ్నలు ముసురుకున్నాయి, అతని ఊహలను చెదరగొడుతూ.

★★★

పెదబాబు కళ్లకు గంతలు కట్టారు. చీలమండలవద్ద రెండు కాళ్లూ కలిపికట్టారు. సీఐ తన సర్వీస్ రివాల్వర్ లోడ్ చేసి, సేఫ్టీ కాచ్ ని రిలీజ్ చేశాడు. రెండు చేతులతోనూ పట్టుకొని బందీ తలవెనుక రివాల్వర్ని గురిపెట్టాడు; అది కాస్తా చేతుల్లోంచి జారిపోతుందేమో అన్నంతగా అతనికి చెమటలు పట్టాయి. ఈ అధ్యాయంగనక సవ్యంగా ముగిసిపోయి తనకు ప్రమోషన్ గాని వస్తే సకుటుంబంగా తిరుపతివచ్చి గుండు గీయించుకుంటానని మొక్కుకున్నాడు. ఆ ఏడుకొండలవాడిమీద భారంపెట్టి ట్రిగ్గర్ నొక్కాడు. ధనేల్మని ప్రేలుడు. కుర్రవాడు కుప్పకూలాడు. కపాలం విచ్చుకుంది; రక్తపుధార. వెంటఉన్న కానిస్టేబుల్స్, శ్వాస నిలిచిపోయిందని నిర్ధారించుకొని తాళ్లు, గంతలు, గబగబా విప్పేశారు . శవాన్ని వాగులోకి తోశారు; ధబ్బుమని నీట్లోపడింది . ప్రవాహానికి కొట్టుకుపోతోంది. కానిస్టేబుళ్లిద్దరూ గుడ్లప్పగించి చూస్తున్నారు. వాళ్లకది కొత్త.

“ఇంక పదండి,” అనివాళ్లని తొందరపెట్టాడు సీఐ.

ముగ్గురూ మౌనంగా రైలుపట్టాల వెంబడి, లెవెల్ క్రాసింగ్ వద్ద నిలుపుచేసిన జీపువైపు నడుస్తున్నారు; ఎవరి ఆలోచనల్లో వాళ్లు. దూరంగా గూడ్సురైలు సిగ్నల్ కోసం కూతపెట్టింది. అంతలోకే హేడ్డు పట్టాలవెంట పరుగెత్తుకుంటూ, ఆయాసపడుతూ వస్తున్నాడు. చేతిలో ఉన్న వైర్లెస్ మెసేజి కాపీని ఊపుతూ,

“సార్, సార్.....డీఎస్పీ దొరగారి మెసేజి సార్....కృష్ణమూర్తి దొరికిపోయాడు” అని దూరంనుండే అరిచాడు.

★★★

సుమారు ఏభైఏళ్లనాటి సంగతి. ఆరోజు ఉదయాన్నే కలకత్తానుండి వస్తూన్న పంచాది కృష్ణమూర్తినీ, మరో ఆరుగుర్నీ సోంపేట (కంచిలి) రైల్వేస్టేషన్ వద్ద అరెస్టు చేశారు. ఆరాత్రే ఒడిషా సరిహద్దులోని జలాంతరకోట కొండల్లో వారందరినీ చంపేశారు. సరిగ్గా అప్పుడే ఎన్ కౌంటర్ అనే మాట తెలుగు భాషలోకి ప్రవేశించింది; నేటికీ వాడుకలో ఉంది.

[ఏంబ్రోస్ బియర్స్ (అమెరికన్ రచయిత,1842-1914?) రచించిన సుప్రసిద్ధకథ ‘ఏన్ అక్కరెన్స్ఎట్ అవుల్ క్రీక్ బ్రిడ్జ్’ నిగురుచేసుకుంటూ]

(‘ఆంధ్రజ్యోతి’, 03 సెప్టెంబరు 2017, ఆదివారం సంచికలో మొదట అచ్చయింది)